సాక్షి
వనపర్తి
బుధవారం, 2, ఆగస్టు, 2023



ఈ కష్టాలు.. ఇంకెన్నాళ్లు ?

కేఎస్పీ ఎడమ కాల్వ పనులు అసంపూర్తిగా ఉండటంతో నీరంతా పంటల్లోకి చేరుతుంది.

వివరాలు 8లో ▸



జూరాలకు తగ్గిన వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.9 /23.4

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో ఉన్న దత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కొత్తకోట, కానాయపల్లి, పాలెం, నిర్వేన్ తదితర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించారు. వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమ అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహం



కొత్తకోట రూరల్: వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని అమడబాకుల రైతువేదికలో మదనాపురం 'కృషి విజ్ఞాన కేంద్రం' ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆయిల్‌పాం సాగుచేస్తే ఎకరాకు 50 మొక్కలు రాయితీపై అందజేస్తారని వివరించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని రైతు సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్త సురేష్‌కుమార్ యాజమాన్య పద్ధతులు, ఆయిల్‌పాం మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం, ఎరువులు వేయడం, తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త దాదా సాహెబ్ గోకరే, సర్పంచ్ బుచ్చన్న, ఎంపీటీసీ సభ్యుడు శేషిరెడ్డి, మామిడి రైతులు భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, రాములు, వెంకటయ్య, పెద్ద బాలరాజు, ఏఈఓ రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

పెబ్బేరు రూరల్: జిల్లాలో బుధవారం నుంచి 31వ తేదీ వరకు జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డా. వెంకటేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువులకు నట్టల నివారణ మాత్రలు, మందులు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని.. పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 27 బృందాలు ఏర్పాటు చేశామని.. గ్రామాలకు వచ్చే బృందాలకు ప్రజాప్రతినిదులు, పశు పోషకులు సహకరించాలని పేర్కొన్నారు.

సర్దుబాటు దిశగా..



మహబూబ్‌నగర్‌లోని రామయ్యబౌలి ప్రాథమిక పాఠశాలలో తరగతులు వింటున్న విద్యార్థులు (ఫైల్)

- 2019 తర్వాత విడుదల కాని టీఆర్టీ నోటిఫికేషన్లు
- ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా పెరిగిన ఖాళీలు
- తాజాగా బోధనా ఇబ్బందులు తలెత్తకుండా దిద్దుబాటు చర్యలు
- బడుల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా తాత్కాలిక బదిలీలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 881 మందికి స్థానచలనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం ప్రారంభమై నెలన్నర రోజులు గడుస్తున్నా.. పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేక బోధన సరిగా సాగడం లేదు. 2019 సంవత్సరం తర్వాత ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్లు వేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఇన్నాళ్లు విద్యావలంటీర్లతో నెట్టుకొచ్చిన ప్రభుత్వం.. కరోనా వ్యాప్తి తర్వాత వారిని కూడా నియమించకపోవడంతో ఇబ్బందులు తీవ్రమయ్యాయి. దీంతో ఎట్టకేలకు మేల్కొన్న విద్యాశాఖ అధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఆయా విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య జీఓ 25 ఆధారంగా తాత్కాలిక బదిలీలు చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ కొన్ని జిల్లాలో పూర్తి కాగా.. మరికొన్ని జిల్లాల్లో కొనసాగుతుంది. కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఏడాది తాత్కాలిక బదిలీలకు సంబంధించి ఆర్డర్లు ఇవ్వనున్నారు. విద్యా సంవత్సరం పూర్తయ్యాక ఏడాది చివరన బదిలీ అయిన ఉపాధ్యాయులు వారి పూర్వస్థానానికి వెళ్తారు. కొన్నిచోట్ల విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం వల్ల అక్కడ పాఠశాలలు మూతబడ్డాయి. అలాంటి పాఠశాలల్లో ఉన్న వారిని తప్పకుండా బదిలీ చేయనున్నారు. అయితే పిల్లలు ఉండి ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న దగ్గర కచ్చితంగా బదిలీ అవ్వాలన్న నిబంధన ఏమీ లేదు. వారి ఇష్టపూర్వకంగా గతంలో ఉన్న పాఠశాల కంటే తక్కువ దూరంలో ఉన్నవాటికి బదిలీ చేస్తున్నట్లు తెలుస్తుంది.

ఉన్నత పాఠశాలలకు కష్టమే..

1 నుంచి 19 మందికి ఒకరు, 60 లోపు ఇద్దరు, 90 లోపు ముగ్గురు ఈ రేషియోకు మించి ఉపాధ్యాయులు ఉంటే ఇతర పాఠశాలలకు బదిలీ చేయనున్నారు. ఇలా సర్దుబాటు కేవలం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే సాధ్యపడనుంది. అయితే ఉన్నత పాఠశాలల్లో ఈ సంఖ్య ప్రకారం సర్దుబాటుకు సాధ్యం కాదని తెలుస్తుంది. ఒక ఉపాధ్యాయుడు ఉంటే ప్రాథమిక పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులు బోధిస్తారు. కానీ, ఉన్నత పాఠశాలల్లో మాత్రం ఒక సబ్జెక్టు బోధించేందుకు ఒక ఉపాధ్యాయుడిని కచ్చితంగా నియమించాల్సి ఉంటుంది.

అభ్యర్థుల ఎదురుచూపు..

ఖాళీల స్థానంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో రెగ్యులర్ ఉపాధ్యాయుల భర్తీ చేపడుతుందని టీఆర్టీ అభ్యర్థులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. చివరిసారిగా 2019 టీఆర్టీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ భర్తీ ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వం ఆ తర్వాత ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వలేదు. గతంలో ఖాళీల స్థానంలో కనీసం విద్యావలంటీర్లను అయినా నియమించేది. కానీ, ఇప్పటి వరకు రెగ్యులర్ ఉపాధ్యాయుల భర్తీ కానీ, వలంటీర్ల నియామకంపై కానీ ఎలాంటి స్పష్టత లేకపోవడంతో తాత్కాలికంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో మొత్తం 881 మంది ఉపాధ్యాయులకు తాత్కాలికంగా స్థానచలనం కల్పించనున్నారు. ఇప్పటికే నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తిలో ప్రక్రియ పూర్తి కాగా.. మహబూబ్‌నగర్‌లో ప్రక్రియ కొనసాగుతుంది. కలెక్టర్ల నుంచి బదిలీ ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది.

జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	ఖాళీలు	తాత్కాలిక బదిలీ అయ్యేవారు
మహబూబ్‌నగర్	856	3,482	479	126
నాగర్‌కర్నూల్	845	3,390	450	200
వనపర్తి	535	2,023	316	175
నారాయణపేట	510	2,020	470	250
జోగుళాంబ గద్వాల	475	1,971	317	130



2 వేలకుపైగా..

ఉమ్మడి జిల్లాలోని 3,221 ప్రభుత్వ పాఠశాలల్లో 12,886 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా దాదాపు 2,032 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇది జూన్ 30వ తేదీ వరకు ఉన్న లెక్క. ప్రతి నెలా కొంత మంది ఉపాధ్యాయులు రిటైర్మెంట్ అవుతున్న నేపథ్యంలో వారి సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. ఫలితంగా ఖాళీల సంఖ్య భారీగా పెరగడంతో.. ఎంత సర్దుబాటు చేసినా బోధన సమస్య తీరడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

నిబంధనల ప్రకారమే..



జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు ఇబ్బందులు కలగకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు చేశాం. నాగర్‌కర్నూల్‌లో 200 మంది, వనపర్తిలో 175 మందిని సర్దుబాటు చేశాం. బదిలీ అయిన వారికి కలెక్టర్ ద్వారా ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది. బదిలీల్లో ఇబ్బందులు లేకుండా నిబంధనల ప్రకారం చేపడుతున్నాం.

– గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్, వనపర్తి

ఇబ్బందులు లేకుండా చర్యలు..



జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల బోధనకు ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తున్నాం. మహబూబ్‌నగర్‌లో ఉపాధ్యాయల సర్దుబాటు చాలా తక్కువగా కేవలం 126 మంది మాత్రమే బదిలీ అవుతున్నారు. నారాయణపేటలో ఎక్కువ మంది తాత్కాలిక బదిలీ అవుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో నిబంధనల ప్రకారం, ఉపాధ్యాయుల ఇష్ట ప్రకారం తక్కువ దూరంలో ఉన్న పాఠశాలలకు బదిలీ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్, నారాయణపేట

ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ల బదిలీ

- **ఉత్తర్వులు** జారీ చేసిన **సీసీఎల్‌ఏ** కమిషనర్



సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మల్టీ జోన్‌- 2 పరిధిలోని తహసీల్దార్లను ఇతర ప్రాంతాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు సీసీఎల్‌ఏ నవీన్‌మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే దగ్గర మూడేళ్లుగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

బదిలీ అయిన తహసీల్దార్ల జాబితా

తహసీల్దార్	పనిచేస్తున్న జిల్లా	సొంత జిల్లా	బదిలీ అయిన జిల్లా
చెన్నకిష్టన్న	మహబూబ్‌నగర్	వనపర్తి	నాగర్‌కర్నూల్
బి.పార్థసారథి	మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్	రంగారెడ్డి
బి.లక్ష్మినారాయణ	మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్	హైదరాబాద్
రత్నావత్ పాండు	మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్	వనపర్తి
జె. సువర్ణరాజు	మహబూబ్‌నగర్	వనపర్తి	జోగుళాంబ గద్వాల
ఆర్. మంజుల	మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్	జోగుళాంబ గద్వాల
వి.రాంబాయి	మహబూబ్‌నగర్	సూర్యాపేట	జోగుళాంబ గద్వాల
బి. శ్రీనివాసులు	మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్	నారాయణపేట
ఎస్.కిషన్	మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్	వనపర్తి
ఎన్.జ్యోతి	మహబూబ్‌నగర్	సూర్యాపేట	వనపర్తి
నాగలక్ష్మి	నారాయణపేట	రంగారెడ్డి	మహబూబ్‌నగర్
తిరుపతయ్య	నారాయణపేట	వనపర్తి	మహబూబ్‌నగర్
జేకే మోహన్	వనపర్తి	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్
జె శ్రీరాములు	వనపర్తి	వనపర్తి	నాగర్‌కర్నూల్
ఎల్ రాజేందర్‌గౌడ్	వనపర్తి	వనపర్తి	నాగర్‌కర్నూల్
ఎ.పాండు	వనపర్తి	వనపర్తి	నాగర్‌కర్నూల్
బి.శాంతిలాల్	వనపర్తి	సూర్యాపేట	యాదాద్రిభువనగిరి
పి.ఏసయ్య	వనపర్తి	వనపర్తి	మహబూబ్‌నగర్
ఎన్.సింధూజ	వనపర్తి	మహబూబ్‌నగర్	నారాయణపేట
వి.గణేశ్వరం	వనపర్తి	మహబూబ్‌నగర్	నారాయణపేట
సునీత	వనపర్తి	మహబూబ్‌నగర్	నారాయణపేట
బి. నరేందర్	వనపర్తి	వనపర్తి	నారాయణపేట
ఎస్. సంధ్య	వనపర్తి	హైదరాబాద్	సంగారెడ్డి
ఎం. శ్రీనివాసరావు	వనపర్తి	హైదరాబాద్	సంగారెడ్డి
డి.మదన్‌మోహన్	జోగుళాంబ గద్వాల	జోగుళాంబ గద్వాల	వనపర్తి
ఆర్.రాజు	జోగుళాంబ గద్వాల	జోగుళాంబ గద్వాల	వనపర్తి
ఆర్.వరలక్ష్మి	జోగుళాంబ గద్వాల	జోగుళాంబ గద్వాల	వనపర్తి
ఎ.యాదగిరి	జోగుళాంబ గద్వాల	జోగుళాంబ గద్వాల	వనపర్తి
డి.లక్ష్మి	జోగుళాంబ గద్వాల	నల్లగొండ	వనపర్తి
కె.ఎల్లన్న	జోగుళాంబ గద్వాల	నారాయణపేట	మహబూబ్‌నగర్
సుందర్‌రాజు	జోగుళాంబ గద్వాల	జోగుళాంబ గద్వాల	మహబూబ్‌నగర్
ఎం.కృష్ణ	నాగర్‌కర్నూల్	నల్లగొండ	యాదాద్రిభువనగిరి
ఎన్.అంజిరెడ్డి	నాగర్‌కర్నూల్	నల్లగొండ	యాదాద్రిభువనగిరి
జె.కృష్ణయ్య	నాగర్‌కర్నూల్	సూర్యాపేట	యాదాద్రిభువనగిరి
పి.శ్రీనివాసరావు	నాగర్‌కర్నూల్	సూర్యాపేట	యాదాద్రిభువనగిరి
ముత్యాలు	నాగర్‌కర్నూల్	నాగర్‌కర్నూల్	వనపర్తి
ముజాఫర్‌హుస్సేన్	నాగర్‌కర్నూల్	జోగుళాంబ గద్వాల	వనపర్తి
ఎస్.శ్రీనివాసులు	నాగర్‌కర్నూల్	నాగర్‌కర్నూల్	వనపర్తి
సి.కృష్ణయ్య	నాగర్‌కర్నూల్	వనపర్తి	మహబూబ్‌నగర్
బి.మల్లికార్జునరావు	నాగర్‌కర్నూల్	సంగారెడ్డి	మహబూబ్‌నగర్
ఆర్.రాజు	నాగర్‌కర్నూల్	నాగర్‌కర్నూల్	మహబూబ్‌నగర్
ఎస్.కిష్టానాయక్	నాగర్‌కర్నూల్	వికారాబాద్	మహబూబ్‌నగర్
సి. భాస్కర్	నాగర్‌కర్నూల్	రంగారెడ్డి	సంగారెడ్డి
కె. సరస్వతి	నాగర్‌కర్నూల్	రంగారెడ్డి	సంగారెడ్డి
పి.ఆశాజ్యోతి	సంగారెడ్డి	సంగారెడ్డి	నాగర్‌కర్నూల్
వై. వెంకటేశ్	సంగారెడ్డి	రంగారెడ్డి	జోగుళాంబ గద్వాల
ఎన్.విద్యాసాగర్‌రెడ్డి	వికారాబాద్	వికారాబాద్	మహబూబ్‌నగర్
పి. శ్రీనివాస్‌రెడ్డి	వికారాబాద్	వికారాబాద్	మహబూబ్‌నగర్
ఎ.రసూల్	వికారాబాద్	సంగారెడ్డి	జోగుళాంబ గద్వాల
వహీదఖాటూన్	వికారాబాద్	హైదరాబాద్	జోగుళాంబ గద్వాల
షాహీదాబేగం	వికారాబాద్	నల్లగొండ	జోగుళాంబ గద్వాల
కేసీ ప్రమీల	నల్లగొండ	నల్లగొండ	నాగర్‌కర్నూల్
ఎచ్. ప్రమీల	నల్లగొండ	వికారాబాద్	నాగర్‌కర్నూల్
ఎల్.మంగ	నల్లగొండ	నల్లగొండ	నాగర్‌కర్నూల్
ఎస్.సైదులు	నల్లగొండ	నల్లగొండ	నాగర్‌కర్నూల్

నేడు కాంగ్రెస్‌లో చేరనున్న నేతలు

- ఢిల్లీకి వెళ్లిన మాజీ మంత్రి జూపల్లి, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి
- ఎమ్మెల్సీ తనయుడు కూచుకుళ్ల రాజేశ్, ఎంపీపీలు మేఘారెడ్డి, కిష్టారెడ్డి సైతం..
- అగ్రనేతల సమక్షంలో పార్టీలో చేరనున్న నాయకులు

సాక్షి, నాగర్‌కర్నూల్: కొల్లాపూర్‌లో నిర్వహించ తలపెట్టిన 'పాలమూరు ప్రజాభేరి' బహిరంగసభ వర్షాల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న నేపథ్యంలో పలువురి నేతల చేరిక ఆలస్యమైంది. దీంతో వారు బుధవారమే ఢిల్లీలో పార్టీ అగ్రనేతల సమక్షంలో పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేశ్, వనపర్తి జిల్లాకు చెందిన ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డిలు మంగళవారం సాయంత్రమే ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. వీరు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకోనున్నారు. తర్వాత కొల్లాపూర్‌లో నిర్వహించే సభలో ఇతర ముఖ్య నాయకులతో పాటు వీరి అనుచరగణం కాంగ్రెస్‌లో చేరుతారని సమాచారం.

ఆరోగ్య సమాజ నిర్మాణానికి కృషి

జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేద్దామని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన 3, 4వ స్థాయీ సంఘం సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసేలా బోధన సాగాలని.. ఇందుకు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులకు తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు. ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధ్యతలపై అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను తరచూ తనిఖీ చేయాలని కోరారు. స్వరాష్ట్రంలో తలసరి ఆదాయం బాగా పెరిగిందని, విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, వైద్యులు తమ బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగుకు మొగ్గు చూపాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో పండ్లు, కూరగాయల సాగుకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఆత్మకూరు జెడ్పీటీసీ సభ్యురాలు ఆర్.శివరంజని, డిప్యూటీ సీఈఓ రాంమహేశ్‌రెడ్డి, డీఈఓ గోవిందరాజులు, డీపీఓ సుధాకర్, ఉద్యాన అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూపి ఆశీర్వాదం కోరదాం



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: ప్రజలు చైతన్యవంతులు.. వారికేమీ తెలియదనుకుంటే అమాయకత్వమే అవుతుంది.. చేసిన అభివృద్ధిని చూపి ఆశీర్వాదం కోరదామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా, పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 64 మినీలిఫ్టులు ఏర్పాటుచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తూ వ్యవసాయాన్ని పండుగ చేశామన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్, వైద్య కళాశాల, దేశంలోనే తొలి వ్యవసాయ డిగ్రీ కళాశాలను నెలకొల్పినట్లు వివరించారు. సొంత డబ్బుతో క్షయ వ్యాధిగ్రస్తులకు బలవర్ధక ఆహారం అందిస్తున్నామని తెలిపారు. 2014 ఎన్నికల్లో ఓడినా అభివృద్ధికి కృషి చేశానని.. 2018 ఎన్నికల్లో పనితనాన్ని గుర్తించి ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా పార్టీ శిక్షణా తరగతుల చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో కాంప్లెక్స్ నిర్మాణం..

ఆటోనగర్‌లో అందరికీ ఒకేచోట స్థలం కేటాయించి కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వెల్డర్స్, మోటార్ వైండర్స్, ఇంజినీర్ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. వృత్తి నైపుణ్యంతో జీవించే వారికి వేర్వేరు ప్రాంతాల్లో భవన నిర్మాణాలు చేపడతామన్నారు. గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేస్తామన్నారు.

సీఎంఆర్ కోటా త్వరగా అందించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు

వనపర్తి: ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన సీఎంఆర్ కోటాను త్వరగా అందించాలని అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైస్ మిల్ వారీగా కేటాయింపులు.. ఇప్పటి వరకు ఇచ్చిన సీఎంఆర్ వివరాలను ప్రస్తావిస్తూ మాట్లాడారు. బియ్యం ఇవ్వటం ఇప్పటికే ఆలస్యమైందని.. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఎస్‌సీఐకి అప్పగించాలని, లేదంటే చర్యలు తప్పని హెచ్చరించారు. ధాన్యం గోదాంలను ఏర్పాటు చేయాలని మిల్లర్లు కోరగా.. అవసరమైన గోదాంలు, స్థలాలు చూపిస్తామని బదులిచ్చారు. సమావేశంలో పౌరసరఫరాల కార్పొరేషన్ డీఎం కొండల్‌రావు, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

వనపర్తిటౌన్: రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ (యూపీఎస్‌సీ–సీసాట్ 2023–24) పరీక్షకు ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు ఈ నెల 13 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎస్. పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.cet.cgg.gov.in/tmreis వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికలు ఉంటాయని, పూర్తి వివరాలకు ఫోన్‌నంబర్ 040–23236112 సంప్రదించాలని పేర్కొన్నారు.

ఓటింగ్ యంత్రాలపై విస్తృత ప్రచారం

కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై విస్తృత ప్రచారం చేయాలని.. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామం, వార్డులోని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ఓటర్లకు అవగాహన కల్పించాలని, రెండు ప్రత్యేక వాహనాల్లో ఈవీఎంలను అమర్చి ఓటర్ల వద్దకే అధికారులు వెళ్లి ప్రచారం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు ఈ నెల 10వ తేదీలోగా www. navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2024, జనవరి 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

వనపర్తిటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ గోవిందరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను 5వ తేదీలోగా మండల విద్యాధికారులకు అందజేయాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

యువ రైతు బలవన్మరణం

గద్వాల క్రైం: యువ రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గద్వాల మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన అశోక్ (28) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక, కుటుంబ సమస్యలు ఎదురవడంతో, దీంతో తీవ్ర మనస్థాపం చెంది మంగళవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వృద్ధురాలి ఆచూకీ కోసం గేట్ల మూసివేత



ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ ప్రధాన ఎడమ కాల్వలో గల్లంతైన వృద్ధురాలి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్ఐ నరేందర్ మంగళవారం తెలిపారు. మండలంలోని మూలమల్లకు చెందిన శంకరమ్మ ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లి ఎడమ కాల్వలో దూకింది. కొంతకాలంగా ఆమె మానసిక స్థితి బాగోలేదని ఎస్ఐ తెలిపారు. గ్రామ శివారులోని ఎన్టీఆర్ ప్రధాన ఎడమ కాల్వలో దూకి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. సోమవారం జూరాల ప్రాజెక్ట్ రెగ్యులేటర్ వద్ద గేట్లను మూయించి మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు వెతికారు. ఆచూకీ లభించలేదని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళలను వేధించిన వ్యక్తిపై కేసు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో మహిళలను లైంగికంగా వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో ఇద్దరు మహిళలను శంకర్ తరుచుగా వేధించేవాడన్నారు. ఎన్ని సార్లు చెప్పినా మారక పోవడంతో మహిళలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యం పట్టివేత: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేట శివారులో అనుమతి లేకుండా మద్యం విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి మంగళవారం తెలిపారు. రుక్కన్నపల్లి చెందిన పెంకుల విష్ణు మానాజీపేట శివారులో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో 52 బాటిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

జడ్చర్ల: విద్యుత్ షాక్ నుంచి ఓ కార్మికుడు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఘటన పట్టణపరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కొత్తగా విద్యుత్ లైన్ మార్పిడి చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ తీగలను బిగించేందుకు మంగళవారం బిహార్‌కు చెందిన ఓ కార్మికుడు స్తంభం ఎక్కాడు. తీగలను పట్టుకున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. రెండు చేతులు విడిచి స్తంభంపై వేలాడినట్లుగా పడిపోయాడు. దీంతో కింద ఉన్న వారు చనిపోయి ఉంటాడని భావించారు. తదుపరి ఓ ఇద్దరు స్తంభం ఎక్కి వేలాడుతున్న వ్యక్తిని గట్టిగా తట్టడంతో చలనం కనిపించింది. వెంటనే సురక్షితంగా కిందకు తీసుకువచ్చి ఆస్పత్రికి తరలించారు. కాగా విద్యుత్ లైన్ల మార్పిడి సమయంలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈసందర్భంగా పలువురు అభిప్రాయం పడుతున్నారు.

జాతీయపోటీలకు జిల్లా క్రీడాకారులు




రాజా రాంచరణ్‌గౌడ్ సాయినిఖిత

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పాండిచ్చేరిలో ఈనెల 3 నుంచి 9 వరకు జరిగే 48వ సబ్ జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ టోర్నీకి ఎంపికయ్యారు. కె.రాజా రాంచరణ్‌గౌడ్ (కొకుంట్ల మండల కేంద్రం), జిల్లా కేంద్రానికి చెందిన కె.సాయినిఖిత మెరుగైన ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. రాజా రాంచరణ్‌గౌడ్ ఆరేళ్ల నుంచి బాస్కెట్‌బాల్‌లో శిక్షణ తీసుకుంటూ విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. అదేవిధంగా సాయినిఖిత తొలిసారిగా జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది.

కందులు @ రూ.8,041

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌యార్డులో మంగళవారం కందులకు క్వింటాల్‌కు రూ.8,041 ధర లభించింది. అదేవిధంగా వేరుశనగకు గరిష్టంగా రూ.8,230, కనిష్టంగా రూ.8,160, మొక్కజొన్నకు రూ.2,130 ధర పలికాయి.

ఈ కష్టాలు.. ఇంకెన్నాళ్లు?



కుడికాల్వ పూర్తికాక కౌకుంట్లలో నీట మునిగిన పత్తి పంట

- అసంపూర్తిగా కేఎస్పీ ఎడమ కాల్వ
- మరమ్మతులకు నోచుకోని కుడి కాల్వ
- నీట మునుగుతున్న పంటలు

దేవరకద్ర రూరల్/చిన్నచింతకుంట: పాలకులు, అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిటా శాపంగా మారింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ నుంచి రైతుల పంటలకు సాగునీరు అందించేందుకు దాదాపు 14 ఏళ్ల క్రితం మొదలుపెట్టిన ఎడమ కాల్వ పొడిగింపు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో వర్షాలు కురిసినప్పుడు కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని ఎడమ కాల్వ నుంచి విడతల వారీగా పంటలకు నీటిని వదిలినప్పుడు ముందుకు వెళ్లే మార్గం లేక రైతుల పంట పొలాల్లోకి చేరుతున్నాయి. దీంతో వందల ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులకు తప్పించుకోలేని స్థాయిలో తీవ్ర నష్టం చోటు చేసుకుంటుంది.

ఏళ్లుగా వెంటాడుతున్న సమస్య..

ప్రాజెక్ట్ ఎడమ కాల్వ పొడిగింపు ద్వారా వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పనులను చేపట్టారు. భూసేకరణ అనంతరం ప్రాజెక్ట్ నీటిని కాల్వల ద్వారా గుడిబండ, గోపన్‌పల్లి, పుట్టపల్లి, రాజోళి, కౌకుంట్ల, దాసరిపల్లి మీదుగా తీసుకెళ్లి చిన్నచింతకుంట మండలంలోని తిర్మలాపూర్ చెరువుకు కలపాలని ప్రణాళిక రూపొందించారు. వివిధ కారణాలతో పనులను రాజోళి గ్రామం దగ్గర నిలిపివేశారు.

మరమ్మతులకు నోచుకోని కుడికాల్వ

చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట, బండ్రపల్లి, పల్లమరి, నెల్లకొండికి సాగునీరు అందించే కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ కుడి కాల్వ మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో ఆయకట్టు కింది రైతులు సాగునీరు అందక ఇబ్బందులకు గురవుతున్నారు.

వందల ఎకరాల్లో నష్టం..

ఎడమ కాల్వ పరిధి కోయిల్‌సాగర్ నుంచి దేవరకద్ర వరకు 14.2 కిలోమీటర్లు ఉండగా, అక్కడి నుంచి మొదలయ్యే కాల్వ విస్తరణ పరిధిలో ఉన్న గ్రామాలలో నల్లరేగడి భూములు అధికంగా ఉండటంతో పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తారు. వాణిజ్య పరమైన పంట కావడంతో అధికంగా పెట్టుబడులు పెట్టే పరిస్థితి ఉంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కాల్వల ద్వారా వచ్చిన నీరు రైతుల పొలాల్లోకి చేరి వందల ఎకరాల్లో పంట నీట మునిగింది. ప్రస్తుతం పత్తి పంట మొలకలు నీటిలో ఉండటంతో ఎర్రబడి చచ్చిపోయో స్థితిలో ఉన్నాయి. దీంతో పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

5కిలో మీటర్ల పొడవున కాల్వకు ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఫీడర్ చానల్, తూములు ధ్వంసమయ్యాయి. దీంతో ఏటా ప్రాజెక్ట్ నుంచి అధికారులు నీటిని విడుదల చేసిన నీరు వృథాగా పోతుంది. చివరి ఆయకట్టుకు అందడం లేదు. దీంతో 5వేల ఎకరాలు బీడుగా మారే అవకాశం ఉంది. కొందరు రైతులు బోరు బావుల కింద పంటలు సాగ చేసినా చివరి వరకు నీరు అందక పంటలు ఎండి పోతున్నాయి.

కుడి, ఎడమ కాల్వల పరిధిలో 12వేల ఎకరాలకు నీరు

ప్రాజెక్ట్ నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా ఏటా అధికారులు 12వేల ఎకరాలకు సాగునీరు అందిస్తారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కుడి కాల్వ చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఐబీ శాఖ నుంచి మేజర్ ఇరిగేషన్ శాఖలో కలిసిన తర్వాత అధికారులు నీటి విడుదలకు జాప్యం వహిస్తున్నారు. ఈ సంవత్సరం ప్రస్తుతం రైతులు నార్లు పోసి నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధం చేశారు. అధికారులు ఇప్పటికైనా చొరువ తీసుకుని కుడి కాల్వ మరమ్మతు చేపట్టి చివరి ఆకట్టుకు నీరు అందిచాలని కోరుతున్నారు.

ఏటా నష్టపోతున్నాం



అప్పులు చేసి మరీ అన్న దమ్ములం కలిసి ఈ సీజన్‌లో దాదాపు 14 ఎకారాల్లో పత్తి పంటను సాగు చేశాం. ఇప్పటికే రూ.2 లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టాం. కాల్వ ద్వారా వచ్చిన నీరు పొలాల్లో మోకాలు లోతు వరకు నిలిచింది. పంట కుళ్లిపోయి పెట్టుబడి అందని పరిస్థితి ఏర్పాడింది. ఏటా ఇలాగే నష్టపోతున్నాం.

– కురుమూర్తి, రైతు, కౌకుంట్ల

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



కాల్వల నుంచి వచ్చిన నీటితో మా పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పెద్ద ఎత్తున పంటలు మునిగిపోతున్నాయి. రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నా పట్టించుకునే వారు లేరు. సమస్యను పరిష్కరించమని అధికారులకు వివరించినా లాభం లేదు. 5 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. మొత్తం నీట మునిగింది.

– నరేష్, రైతు, కౌకుంట్ల

పంట ఎండుతుంది..



ప్రతి సంవత్సరం కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ నీరు వస్తుందని కాల్వ కింద ఉన్న పొలంలో పంట సాగు చేస్తున్నాను. కాని నీరు రాక పంట చేతికి వచ్చే సమయంలో ఎండి పోతుంది. పంటకు తెచ్చిన పెట్టుబడి తీర్చలేక పోతున్నాం. అధికారులు ఈ సంవత్సరమైన పంట సాగుకు నీరు అందించాలి.

– కుర్వ నర్సింహులు, రైతు, లాల్‌కోట



ముళ్లపొదలు,పిచ్చిమొక్కలతో కోయిల్‌సాగర్ కుడికాల్వ



బండ్రపల్లి, లాల్‌కోట మధ్య ధ్వంసమైన తూములు

గొడ్డళ్లతో నరికి వ్యక్తి హత్య



బోడమోని కాశన్న (ఫైల్)

పెద్దకొత్తపల్లి: పాత కక్షలు, వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే నెపంతో మండలంలోని దేవినేనిపల్లికి చెందిన బోడమోని కాశన్న (32)ను మంగళవారం తన వ్యవసాయ పొలంలో హత్య చేశారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన శారద, లోకేష్, కిష్టయ్య, బీరయ్య, రాముడు, శంకర్ గొడ్డళ్లు, కత్తులతో చంపినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతుడి తమ్ముడు శివుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

- జల విద్యుత్ కేంద్రంలో 12 యూనిట్లలో విద్యుదుత్పత్తి
- 46,644 క్యూసెక్కుల నీరు దిగువకు



వరద జలాలతో కళకళలాడుతున్న జూరాల ప్రాజెక్టు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 37వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 86, సమాంతర కాల్వకు 700, భీమా లిఫ్టు–1కు 1,300, లిఫ్టు–2కు 750, నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 1500, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి దిగువన శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.389 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆల్మట్టికి ప్రస్తుతం 1,17,977 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 90వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా, 110.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 30.74 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 90వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టు నుంచి 85,369 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. మంగళవారం 12 యూనిట్ల ద్వారా 472 మెగావాట్లు, 53.185 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరద చేరుతుండడంతో ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 26.908 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 26.277 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 53.185 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు. 42వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసులకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. మంగళవారం 1,016 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ఒక గేటు తెరిచి 886 క్యూసెక్కులు దిగువకు, 130 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

శ్రీశైలంలో 852.3 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 852.3 అడుగుల నీటిమట్టం, 85.2 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం 6గంటలకు 42,899 క్యూసెక్కుల నీరు శ్రీశైలంకు చేరాయి. స్థానికంగా 10.40 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది.

నిండుగా రామన్‌పాడు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం నాటికి పూర్తి స్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 445, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 950, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేస్–2 పంప్ హౌజ్ ద్వారా 858 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. తాగునీటి కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

గోపాల్‌పేట: రేవల్లి మండలం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వరకట్న వేదిపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.రేవల్లి మండల కేంద్రానికి చెందిన యువతి అంకూరు మాన్యకు పెద్దమందడి మండలం వెల్టూర్‌కు చెందిన కానాపురం శ్రీనుతో పది నెలల క్రితం వివాహం చేశారు. అప్పటి నుంచి అదనపు కట్నం తేవాలని భర్త రోజూ తాగి వచ్చి భార్యను వేధించేవాడు. ఆయనతో పాటు అత్త, మామ, ఆడపడుచుల సైతం వేధించేవారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అయిజలో పూర్తయిన పైపులైన్ పనులు



పైపులైన్ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

- నేటి నుంచి తాగునీటి సరఫరా
- ట్రయల్ రన్ సక్సెస్

అయిజ: పట్టణంలోని పెద్ద వాగుపై చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి పనుల వలన వాటర్ గ్రిడ్ పైపులైన్ కుప్పకూలిన విషయం విధితమే. పునరుద్ధరణ పనులు చేపట్టి 12 రోజులైంది. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పనులు నత్తనడకన సాగాయి. వర్షాలు ఆగిపోవడంతో అధికారులు పనులను వేగవంతం చేశారు. సోమవారం పూర్తికావడంతో మంగళవారం వాటర్ గ్రిడ్ ఎస్ఈ జగన్మోహన్, ఈఈ భీమేశ్వర్‌రావు, డీఈ నాగరాజు, ఏఈ రమేష్, ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రమోహన్ తక్కువ మోతాదులో నీటిని విడుదల చేశారు. బుధవారం నుంచి అలంపూర్‌లోని మూడు మున్సిపాలిటీలకు, 83 గ్రామాలకు తాగునీటి సరఫరాను పునరావృతం చేస్తామని అధికారులు తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

మహమ్మదాబాద్: మండలంలోని ఓ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జోగు నర్సింహులు బాలిక ఇంట్లో ఎవరూ లేనిది చూసి ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా యువకుడిపై మంగళవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బ్యాంకు మేనేజర్‌పై దాడి: కేసు నమోదు

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో ఉన్న ఎస్‌బీఐ మేనేజర్ జి.లతపై దాడికి పాల్పడిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రావుపలపల్లికి చెందిన సుంకరి శ్రీనివాసులు మధ్యాహ్నం బ్యాంకులో మేనేజర్ చాంబర్‌లోకి వచ్చాడు. తన ఖాతా ఎందుకు హోల్డ్‌లో ఉంచారని దుర్భాషలాడుతూ మేనేజర్‌పై చేయి చేసుకున్నాడు. కత్తిని చూపించి చంపుతానని బెదిరింపులకు గురిచేశాడు.. దీంతో బ్యాంకు సహచర సిబ్బంది రావడంతో వెంటనే బ్యాంకు నుంచి వెళ్లిపోయాడు. పోలీసులకు మేనేజర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'పాలమూరు'కు జాతీయహోదా ఏమైంది?



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదాపై జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మాట్లాడకపోవడం సరికాదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 2014లో సుష్మాస్వరాజ్, 2019లో నరేంద్రమోదీ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని కెన్‌బెట్వా, కర్ణాటకలోని అప్పర్‌భద్ర ప్రాజెక్టుకులకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి పాలమూరు ప్రాజెక్టుకు ఎందుకు జాతీయహోదా తీసుకురావడం లేదన్నారు. నడిగడ్డకు అన్యాయం జరిగే అప్పర్‌భద్రకు జాతీయహోదాతో పాటు రూ.5,300 కోట్లు కేంద్రబడ్జెట్‌లో కేటాయించారన్నారు. ఉమ్మడి జిల్లా బీజేపీ నాయకులు నడిగడ్డ ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అప్పర్‌భద్ర వల్ల కర్ణాటక, ఏపీ, తెలంగాణలకు ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర డ్యాంకు నీరు అందక దాని మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. దీంతో ఆర్‌డీఎస్ కింద 90వేల ఎకరాలకు నీరందని ప్రమాదం ఉందన్నారు. ఐటీఆర్ ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసి తెలంగాణకు ఇస్తే బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే తెలంగాణలో జాతీయ రహదారులు నిర్మించినట్లు కిషన్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. జాతీయ రహదారులను అభివృద్ధి చేసింది కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వమని తెలిపారు. సమావేశంలో జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు బెక్కరి అనిత, సాయిబాబా, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

మూలమల్లలో మొక్కల పెంపకం



జెన్‌కో భూములను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ అనిల్‌కుమార్

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన దిగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం సేకరించిన భూముల్లో మొక్కల పెంపకం చేపడుతామని డీఎఫ్‌ఓ అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని మూలమల్ల శివారులోని జెన్‌కో భూములను పరిశీలించారు. అధికారులు అడవుల పెంపకం కోసం 13 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింగ్ రావు, ఏపీఓ విజయభాస్కర్ ఉన్నారు.

గురుకులాల్లో పార్ట్‌టైం లెక్చరర్ పోస్టుల భర్తీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ఎస్టీ జూనియర్ కళాశాల గురుకులాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ రజినీ రాగలత, సుజాతారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మహబూబ్‌నగర్, జడ్చర్ల, అచ్చంపేట, కల్వకుర్తి, మున్ననూర్ తదితర గురుకులాల్లో వివిధ సబ్జెక్టుల వారీగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గలవారు ఈనెల 3వ తేదీల్లో నిర్వహించే డెమోలకు హాజరుకావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 83339 25369, 94909 57314 నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

6న రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

స్టేషన్ మహబూబ్‌నగర్: రైల్వే స్టేషన్ల అభివృద్ధి, సౌకర్యాల ఏర్పాటు కోసం భారతీయ రైల్వేశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద 6వ తేదీన జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ రోజు దేశవ్యాప్తంగా 500 రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులకు వర్చువల్‌లో శంకుస్థాపన చేయనున్నారని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే శంకుస్థాపనకి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

కోస్గి: పట్టణ శివారులోని గంధం చెరువు వద్ద కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాసులు, మరో ఎస్ నరేష్ మంగళవారం దాడులు నిర్వహించగా ఐదుగురిని పట్టుకున్నారు. వీరి నుంచి రూ.15వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు..

'మద్దిమడుగు' హుండీ రూ.41.61లక్షలు



హుండీ లెక్కిస్తున్న భక్తులు, అధికారులు

అమ్రాబాద్: పదర మండలం మద్దిమడుగు పబ్బతీ ఆంజనేయస్వామి హుండీని మంగళవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. నాలుగు నెలలకు సంబంధించిన మొత్తం రూ.41,61,272 నగదు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మిశ్రమ వెండి 3కిలోల 850గ్రాములు వచ్చింది. లెక్కించిన మొత్తాన్ని పదర ఏపీజీవీబీలో భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విష్ణుమూర్తి, ముఖ్య దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, కార్యనిర్వాహణ అధికారి రంగాచారి, జైపాల్‌రెడ్డి, జంగయ్య, అజయ్, ఆలయ ప్రధాన అర్చకుడు వీరయ్యశర్మ, భక్తులు పాల్గొన్నారు.

మంచిరేవుల భూములు ప్రభుత్వానివే

గ్రేహౌండ్స్‌కు బదలాయించాలంటూ సుప్రీంకోర్టు తీర్పు

" మంచిరేవులలోని ఈ భూములకు విలువ పెరగడంతో వాటిపై రాబందుల కళ్లు పడ్డాయని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ల్యాండ్ మాఫియా జోక్యం కూడా కనిపిస్తోంది. ఈ భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తుదివి. ఎలాంటి జోక్యాలు అనుమతించబోం''
– జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవులలోని 142.39 ఎకరాల భూయాజమాన్య హక్కులు పూర్తిగా తెలంగాణ ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 1994 నుంచి కొనసాగుతున్న భూవివాదానికి ముగింపు పలికింది. ఆక్రమణకు గురైన ఈ భూములు గ్రేహౌండ్స్‌కు సంబంధించినవని పేర్కొంది. మంచిరేవుల భూములకు సంబంధించి హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు విచారించిన జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం మంగళవారం తుదితీర్పు వెలువరించింది. మంచిరేవులకు సంబంధించిన భూములు ప్రైవేటు వ్యక్తులవేనని హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. దీనిని విచారించిన డివిజన్ బెంచ్ 2021లో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు అనంతరం ఇచ్చిన తుదితీర్పులో.. ఆర్టికల్ 142 ప్రకారం అధికారాలు వినియోగిస్తూ ఈ పిటిషన్లు కొట్టివేస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ భూములపై కిందిస్థాయి కోర్టులు, హైకోర్టు ఎలాంటి జోక్యం చేసుకునే అధికారం లేదని, ఇప్పుడు ఇచ్చిన తీర్పే తుదితీర్పు అని ఆదేశాల్లో పేర్కొంది. సదరు భూమి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందుతుందని, తదుపరి కేటాయింపులపై దాని యాజమాన్య, స్వాధీన హక్కులు ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకొని గ్రేహౌండ్స్‌కు బదిలీ చేయాలని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు కేకే వేణుగోపాల్, సీఎస్ వైద్యనాథన్, గిరి, ఏఓఆర్ శ్రీహర్షలు వాదనలు వినిపించారు. ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉన్న ఈ భూములు పలువురు ఆక్రమించుకొని 1993లో అక్రమంగా విక్రయించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయాన్ని గుర్తించి వారికి నోటీసులు జారీ చేసింది.

రూపు మారుతున్న ఉత్తరాంధ్ర

విశాఖపట్నంకు ఇనార్బిట్ మాల్: ఏపీ సీఎం వైఎస్ జగన్

- రూ. 600 కోట్లతో 12 – 13 ఎకరాల్లో భారీ స్థాయిలో నిర్మాణం
- 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి
- రెండో దశలో 2.5 లక్షల చదరపు అడుగుల్లో 'ఐటీ స్పేస్'.. మరో 3 వేల జాబ్స్
- అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ దిశగా ప్రణాళికలు
- నగరంలో 7 స్టార్ హోటల్ నిర్మాణానికి రహేజా ఉత్సాహం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ అభివృద్ధికి మరింత దోహదపడేలా నగరానికి ఆణిముత్యంలా ఇనార్బిట్ మాల్ నిలిచిపోతుందని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా కైలాసపురం ప్రాంతంలో రూ.600 కోట్ల పెట్టుబడులతో రహేజా గ్రూప్ చేపట్టిన ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులకు సీఎం జగన్ భూమి పూజ చేశారు. రూ.134.58 కోట్లతో జీవీఎంసీ తలపెట్టిన అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీలో రూ.130 కోట్లతో నిర్మించిన ఐదు భవనాలను సీఎం ప్రారంభించారు. దక్షిణాది లో అతి పెద్దదైన ఇనార్బిట్ మాల్‌తో పాటు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ స్పేస్, కన్వెన్షన్ సెంటర్‌ను కూడా తర్వాత దశలో రహేజా సంస్థ నిర్మించనుందని సీఎం జగన్ వెల్లడించారు. కేటాయించిన మొత్తం స్థలం విస్తీర్ణం 17 ఎకరాలు కాగా 12–13 ఎకరాల్లో మాల్ ఏర్పాటు కావడం చాలా తక్కువ ప్రాంతాల్లో మాత్రమే జరుగుతుందన్నారు. ఇదే రహేజా గ్రూప్ హైద రాబాద్‌లో ఇనార్బిట్ మాల్‌ను కేవలం 7–8 ఎకరా ల్లో నిర్మించగా విశాఖలో 12–13 ఎకరాల్లో నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేలా..

ఇంత భారీ మాల్ ఏర్పాటుతో విశాఖ రూపురేఖలు మారడమే కాకుండా దక్షిణాదిలో అతి పెద్దదిగా నిలవనుంది. 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. 12–13 ఎకరాల్లో మాల్ నిర్మాణం పూర్తయిన తరువాత 2 దశ కింద మిగిలిన 4 ఎకరాల్లో 2.5 లక్షల చదరపు అడుగుల్లో ఐటీ స్పేస్ కూడా అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి కూడా ప్రణాళికలు రూపొందించారు. ఐటీ స్పేస్ ద్వారా మరో 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు రానున్నాయి. గత పర్యటన సందర్భంగా విశాఖలో అదానీ డేటా సెంటర్, ఐటీ స్పేస్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశాం. ఇవన్నీ రానున్న రోజుల్లో విశాఖ, ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేలా గొప్ప అడుగులు అవుతాయి. మాల్ కూడా అదే కోవలోకి వస్తుంది.



ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్. చిత్రంలో నీల్ రహేజా

సాగర తీరంలో 7 స్టార్ హోటళ్లు..

రహేజా గ్రూప్ దేశంలో పలు చోట్ల ఫైవ్‌స్టార్ హోటళ్లను నిర్మించింది. అదేవిధంగా ఏపీలో కూడా రాజ్ విలాస్ తరహాలో సూపర్ లగ్జరీ ఫైవ్‌స్టార్, 7 స్టార్ హోటళ్ల నిర్మాణం కానున్నాయి. ఇప్పటికే ఒబెరాయ్ సంస్థ రాజ్ విలాస్ తరహాలో 7 స్టార్ కేటగిరీలో రిసార్ట్, మే ఫెయిర్ సంస్థ సూపర్ లగ్జరీ 7 స్టార్ హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చాయి. అదే తరహాలో నీల్ రహేజా కూడా 7 స్టార్ హోటల్‌ను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఇవన్నీ విశాఖ రూపురేఖలను మార్చే గొప్ప ప్రాజెక్టులు అవుతాయి. ఇక హిందూపూర్‌లో 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన పార్క్ రానుంది. దీని ద్వారా 15 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు నీల్ రహేజా తెలియచేశారు.

ఏపీలో ఎంతో అనువైన వాతావరణం

దార్శనిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధికి ఎంతో అనువైన వాతావరణం ఉంది. అతి తక్కువ సమయంలో ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయడం శుభ పరిణామం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ వరుసగా అగ్రస్థానంలో నిలవడానికి ఇవే కారణం. ఈ మాల్ ప్రజల షాపింగ్ అవసరాలు తీర్చడమే కాకుండా ఆహ్లాదకరమైన, వినోదాత్మక ప్రదేశంగా అందరినీ ఆకట్టుకుని అలరిస్తుంది.
– రజనీష్ మహాజన్, ఇనార్బిట్ మాల్ సీఈవో

మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం

ఇక్కడ త్వరలో నిర్మించబోయే ఐటీ స్పేస్ ద్వారా ఐటీ రంగం అభివృద్ధి కార్యక్రమాలను చేపడతాం. మాకు ప్రపంచవ్యాప్తంగా రాజ్‌విల్లాల తరహాలో లగ్జరీ హోటళ్లున్నాయి. అదే కాన్సెప్ట్‌ను విశాఖతో పాటు ఏపీలో తేవాలనుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన పారిశ్రామిక పార్కులపై కూడా దృష్టి సారిస్తున్నాం. హిందూపూర్‌లో 350 ఎకరాల్లో టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్కు అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. దీని ద్వారా 15 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. విశాఖలో ఇనార్బిట్ మాల్‌ను దుబాయ్ మాల్, మాల్ ఆఫ్ ఎమిరేట్స్ తరహాలో ప్రపంచ స్థాయి మాల్‌గా అభివృద్ధి చేస్తున్నాం. మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం.
– నీల్ రహేజా, రహేజా గ్రూప్ ప్రెసిడెంట్

రాష్ట్రంలో 39 అమృత్ భారత్ స్టేషన్లు

- తొలిదశలో 21 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులకు 6న ప్రధాని శంకుస్థాపన
- వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న మోదీ



సాక్షి, న్యూఢిల్లీ: అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా తెలంగాణలోని మొత్తం 39 రైల్వే స్టేషన్లను గుర్తించి వీటిని సంపూర్ణంగా ఆధునీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మొదటి విడతగా 21 స్టేషన్లకు సంబంధించిన పనులను ఆగస్టు 6న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

'అమృత్ భారత్ స్టేషన్ల'పథకంలో భాగంగా.. రైల్వే స్టేషన్లను ఆధునీకరించడంతోపాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులకు వెయిటింగ్ హాల్స్, టాయిలెట్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఉచిత వై–ఫై సదుపాయాన్ని కల్పిస్తారు. అదేవిధంగా స్థానిక ఉత్పత్తులకు సరైన గుర్తింపు కల్పించేందుకు 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' దుకాణాలు, ప్రయాణీకులకు అవసరమైన సమాచారం అందించే వ్యవస్థలు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు ఏర్పాటు చేస్తారు. స్టేషన్ ముందు, వెనక భాగాల్లో మొక్కల పెంపకంతో పాటు చిన్న గార్డెన్లు కూడా నెలకొల్పుతారు. ఇక స్టేషన్ల అవసరాలకు అనుగుణంగా బిజినెస్ మీటింగ్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేయనున్నారు. వీటికి తోడుగా నగరానికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలను అనుసంధానం చేయడం, దివ్యాంగులకోసం ప్రత్యేక ఏర్పాట్లు, పట్టాలకు ఇరువైపులా కాంక్రీట్ బాటలు, రూఫ్ ప్లాజాలు (అవసరాన్ని బట్టి), దీర్ఘకాలంలో అవసరమయ్యే నిర్మాణాలను ఈ పథకంలో భాగంగా చేపట్టనున్నారు. కాగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో వచ్చే 40 ఏళ్ల అవసరాలు తీర్చేవిధంగా అభివృద్ధి చేసేందుకు రూ.715 కోట్లు, చర్లపల్లి టర్మినల్ అభివృద్ధికి రూ.221 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిన విషయం తెలిసిందే.

తెలంగాణలో మొత్తం గుర్తించిన స్టేషన్లు 39: ఆదిలాబాద్, బాసర్, బేగంపేట్, భద్రాచలం రోడ్, గద్వాల్, హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ, ఉప్పుగూడ, హైదరాబాద్ (నాంపల్లి), జడ్చర్ల, జనగాం, కాచిగూడ, కామారెడ్డి, కరీంనగర్, కాజీపేట జంక్షన్, ఖమ్మం, లింగంపల్లి, మధిర, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మలక్‌పేట్, మల్కాజ్‌గిరి, మంచిర్యాల్, మేడ్చల్, మిర్యాలగూడ, నల్లగొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రామగుండం, సికింద్రాబాద్, షాద్‌నగర్, శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగుళాంబ, తాండూర్, ఉందానగర్, వికారాబాద్, వరంగల్, యాదాద్రి, యాకుత్‌పురా, జహీరాబాద్.

- మొదటి విడతలో ఆగస్టు 6న పనులు ప్రారంభం కానున్న 21 స్టేషన్లపై రూ.894 కోట్లు ఖర్చుచేయనున్నారు.

హైదరాబాద్ (నాంపల్లి) – రూ.309 కోట్లు
నిజామాబాద్ – రూ.53.3 కోట్లు
కామారెడ్డి – రూ.39.9 కోట్లు
మహబూబ్‌నగర్ – రూ.39.9 కోట్లు
మహబూబాబాద్ – రూ.39.7 కోట్లు
మలక్‌పేట్ (హైదరాబాద్)– రూ.36.4 కోట్లు
మల్కాజ్‌గిరి (మేడ్చల్) – రూ.27.6 కోట్లు
ఉప్పుగూడ (హైదరాబాద్)– రూ.26.8 కోట్లు
హఫీజ్ పేట (హైదరాబాద్) – రూ.26.6 కోట్లు
హైటెక్ సిటీ (హైదరాబాద్) – రూ.26.6 కోట్లు
కరీంనగర్ – రూ.26.6 కోట్లు
రామగుండం (పెద్దపల్లి)– రూ.26.5 కోట్లు
ఖమ్మం – రూ.25.4 కోట్లు
మధిర (ఖమ్మం) – రూ.25.4 కోట్లు
జనగాం – రూ.24.5 కోట్లు
యాదాద్రి – రూ.24.5 కోట్లు (యాదాద్రి భువనగిరి)
కాజీపేట జంక్షన్ – రూ.24.5 కోట్లు (హనుమకొండ)
తాండూర్ (వికారాబాద్)– రూ.24.4 కోట్లు
భద్రాచలం రోడ్ – రూ.24.4 కోట్లు (కొత్తగూడెం)
జహీరాబాద్ (సంగారెడ్డి)– రూ.24.4 కోట్లు
ఆదిలాబాద్ – రూ.17.8 కోట్లు

బ్రో.. ఇది పెద్ద స్కామ్.. నిర్మాత ద్వారా పవన్‌కు బాబు ప్యాకేజీ

ఏపీ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: తనను కించపరిచేలా బ్రో సినిమాలో ఓ పాత్ర పెట్టి పవన్ కల్యాణ్ శునకానందం పొందుతున్నారని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. బ్రో సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కలెక్షన్లు పెంచుకో వడం కోసమే తన పాత్రపై వివాదం సృష్టిస్తున్నా రని ఆరోపించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవా రం మంత్రి అంబటి మీడియాతో మాట్లాడారు. బ్రో సినిమా నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌కు అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయన్నారు. చంద్రబాబు ముఠా అమెరికాలో డబ్బులు వసూలు చేసి విశ్వప్రసాద్‌కి ఇస్తే.. ఆ మొత్తాన్ని పవన్ కల్యాణ్‌కు ప్యాకేజీ రూపంలో అందించారని తీవ్ర విమర్శలు చేశారు. దీనికి ఆధారాలు ఏమిటని ఒక విలేకరి ప్రశ్నించగా.. అంతర్జాతీయ నిఘా సంస్థకు చెందిన ప్రముఖుడొకరు తనకి విషయాన్ని చెప్పారని అంబటి వెల్లడించారు. తన రెమ్యూనరేషన్ కింద రూ.66 కోట్లు తీసుకున్నారా? లేక రూ.80 కోట్లు తీసుకున్నారా? ఈ మొత్తానికి ఆదాయపన్ను శాఖకు లెక్కలు చెప్పారా? అనేది పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. రెమ్యూనరేషన్ కింద రోజుకు రూ.2 కోట్లు తీసుకున్నారని ఒకరు, 40 రోజులు కాల్‌షీట్లు ఇచ్చారని ఒకరు, 23 రోజులే ఇచ్చారని ఒకరు చెప్పారని గుర్తు చేశారు. 40 రోజులపాటు కాల్‌షీట్లు ఇచ్చి ఉంటే పవన్‌కు రూ.80 కోట్లు ముట్టినట్టు స్పష్టంగా తెలుస్తోందన్నారు. నిర్మాత విశ్వప్రసాద్ బ్లాక్ మనీని వైట్‌గా చేసి పవన్‌కు ప్యాకేజీ రూపంలో ఇచ్చారని ఆరోపించారు. ఇది ఒక కుంభకోణమన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థల పరిశీలన

- కోడ్గల్, ఈద్గాన్‌పల్లిలో పరిశీలించిన అధికారులు
- మామిడి రైతులకు కలుగనున్న ప్రయోజనం
- కేంద్ర ప్రభుత్వం మ్యాంగో యూనిట్‌కు అనుమతులు



రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లిలోని మామిడితోట

జడ్చర్ల టౌన్: క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మంజూరు చేసిన మామిడిపండ్ల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ త్వరలోనే ఏర్పాటు కానుంది. ఉద్యానవనశాఖ పరిధిలో ఉండే యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన స్థలాన్ని జడ్చర్ల నియోజకవర్గంలోని జడ్చర్ల మండలం కోడ్గల్, రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి గ్రామాల్లో పరిశీలన చేస్తున్నారు. అయితే ఇందుకు సంబంధించిన కార్యాలయం మాత్రం కొల్లాపూర్‌లో ఏర్పాటు చేయనున్నారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కోసం రాష్ట్రంలో ఇంప్లిమెంట్ ఏజెన్సీగా ప్రసాద్ సీడ్స్ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు. దీనివల్ల మామిడిరైతులకు ప్రయోజనం కలుగనుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 9వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. కొల్లాపూర్ ప్రాంతంలో అత్యధికంగా సాగు చేస్తుండటంతో అక్కడే క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కార్యాలయం ఏర్పాటు అనువైనదిగా ప్రసాద్ సీడ్ ఏజెన్సీ గుర్తించింది. కార్యాలయం త్వరలో ప్రారంభించేందుకు వారు సన్నాహాలు చేస్తున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మాత్రం రవాణాకు అనుకూలంగా ఉండేలా చూస్తున్నారు. 44వ నంబరు జాతీయ రహదారితోపాటు విమానాశ్రయానికి దగ్గరగా ఉండే జడ్చర్ల మండలం కోడ్గల్, రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లిలో స్థల పరిశీలన చేస్తున్నారు. ఇప్పటికే రెండు గ్రామాల్లో 15నుంచి 20ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. రెండింటిలో ఒకచోట ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పే అవకాశాలు ఉన్నాయి.

ఇవి ప్రయోజనాలు..

ప్రస్తుతం దిగుబడి అయిన మామిడి హైదరాబాద్ తోపాటు ఇతర ప్రాంతాలకు మాత్రమే ఎగుమతి చేస్తున్నారు. కొందరు పెద్దరైతులు విదేశాలకు ఎగుమతులు చేసుకుంటున్నారు. అయితే మామిడి రైతులందరికీ ప్రయోజనం కలిగేలా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ఏజెన్సీ నిర్వాహకులు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. దీంతో నాణ్యమైన పండ్లు విదేశాలకు సైతం ఎగుమతి చేసే వెసులుబాటు కలుగుతుంది. ప్రాసెసింగ్ యూనిట్‌లో కోల్డ్‌స్టోరేజీ సౌకర్యం ఉండటం వల్ల ధర లేనప్పుడు నిల్వచేసి, డిమాండ్ పెరిగాక వాటిని విక్రయించటానికి వీలవుతుంది. ఇక తోటలు వేసే వారికి సబ్సిడీలు అందుతాయి. మ్యాంగో కవర్లు స్కీం ద్వారా సరఫరా చేస్తారు. అలాగే మామిడి సాగు పట్ల రైతుల్లో అవగాహన కలిగించటం, ఆధునిక పద్ధతుల పట్ల సదస్సులు నిర్వహించి వివరించటం చేస్తారు. మామిడి పండ్లు విక్రయాలు కానట్లయితే ప్రాసెసింగ్ యూనిట్ గుజ్జు తీసి నిల్వ చేసుకునే వీలుంటుంది. తద్వారా కొందరికి ప్రత్యక్ష ఉపాధి సైతం లభిస్తుంది. అలాగే టమాట రైతులకు సైతం కోల్డ్‌స్టోరేజి వల్ల లాభం కలుగుతుంది. టమాట నిల్వచేసుకోవటం, గుజ్జు తీసి పౌడర్ తయారు చేయటం వంటికి ఇందులో చేసుకోవచ్చు.

కస్టం హైరింగ్ సెంటర్ ఏర్పాటు..

రైతులు మామిడి సాగు చేసేందుకు అవసరమైన యంత్ర సామగ్రి కొనుగోలు చేయాలంటే వ్యయంతో కూడుకున్నదిగా మారింది. ఈ పథకంలో కస్టం హైరింగ్ సెంటర్ ఏర్పాటు కావటం వల్ల ఎంతో మేలు కలుగనుంది. రైతులకు కావాల్సిన పరికరాలు సెంటర్‌లో అద్దెకు లభిస్తాయి. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు తమకు కావాల్సిన యంత్రాలు, పరికరాలు అద్దెకు తీసుకుని పనులు చేసుకునే అవకాశం కలుగుతుంది. తద్వారా రైతులకు ఆర్థికభారం తగ్గుతుంది.

రెండు స్థలాలు గుర్తించాం..

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ కోసం రెండు స్థలాలను ఎంపిక చేశాం. జడ్చర్ల మండల కోడ్గల్, రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లిలో స్థలాలు గుర్తించాం. ప్రస్తుతం పథకం ప్రారంభ దశలోనే ఉంది. ప్రోగ్రాం ద్వారా మామిడి రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి.
– హిమబిందు, ఉద్యానవనశాఖ అధికారి, జడ్చర్ల

మామిడి రైతులకు ప్రయోజనం..

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం వల్ల మామిడి రైతులకు ప్రయోజనం కలుగనుంది. ఉమ్మడి జిల్లాలో 9వేల ఎకరాల్లో మామిడితోట సాగవుతోంది. ప్రోగ్రాంలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్, కస్టం హైరింగ్ సెంటర్ ఏర్పాటవుతాయి. దీని వల్ల రైతులకు కావాల్సిన పరికరాలు అద్దెకు లభిస్తాయి. పండ్ల మార్కెటింగ్ అవకాశాలు కలుగుతాయి. విదేశాలకు ఎగుమతి చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.
– సాయిబాబ, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

'ధరణి పోర్టల్ రద్దు చేస్తాం'



వల్లబ్‌రావుపల్లిలో అనిరుధ్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మిడ్జిల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం ప్రజాహిత పాదయాత్రలో భాగంగా వస్పుల, వల్లబ్‌రావుపల్లి, రాణిపేట్‌లో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. మహిళలకు రూ.500గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలని పార్టీ నిర్ణయించిందని తెలిపారు. ప్రజలకు గతంలో పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఉచిత విద్యుత్ నిరంతరంగా ఇస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మండలంలో ఒక డబుల్ బెడ్రూం కూడ ఇంతవరకు ప్రజలకు ఇవ్వలేదని, గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. త్వరలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని తెలిపారు. ధరణి పేరుతో రైతుల భూములను అధికార పార్టీ నాయకులు దగా చేసి లాక్కుంటున్నారని అన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో అధికార పార్టీ భూకబ్జాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ప్రజలకు న్యాయం కోసం పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రబ్బానీ, అల్వాల్‌రెడ్డి, సాయిలు, కృష్ణారెడ్డి, సంపత్, జహంగీర్, నర్సింహులు, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోకాలు గాయంతో పాదయాత్రకు బ్రేక్..

ప్రజాహిత పాదయాత్ర మంగళవారం మాధ్యాహ్నం రాణిపేట్‌కు భోజన విరామం సమయానికి చేరుకుంది. ఇటీవల అనిరుధ్‌రెడ్డి మోకాలికు గాయమైంది. వైద్యులు పరిశీలించి గాయం ఎక్కువైనట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లడంతో తాత్కాలికంగా పాదయాత్రకు రెండు రోజుల పాటు బ్రేక్ వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి తెలిపారు.

గుప్తనిధులు దొరికాయని వదంతులు



కోనేరు వద్ద మట్టిని తీస్తున్న హిటాచీ

- కొనసాగుతున్న కోనేరు పూడికతీత పనులు

జడ్చర్ల టౌన్: వెయ్యేళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ కోనేరు పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. భక్తురాలు డా.జయంతిరెడ్డి గత నెల 15నుంచి పనులు చేయిస్తున్నారు. మంగళవారం కోనేరు తవ్వకాల సందర్భంగా స్వామి కిరీటం, కత్తి బయటపడ్డాయని పెద్ద ఎత్తున వదంతులు వచ్చాయి. వాటిని ఆలయ పూజారులు తీసుకువెళ్లారని దావానంలా వ్యాపించటంతో పెద్ద సంఖ్యలో పట్టణవాసులు కోనేరు వద్దకు తరలి వచ్చారు. అయితే కోనేరులో ఎలాంటి నిధులు లభ్యం కాలేదని అక్కడ పనిచేస్తున్న వారు తెలియజేశారు. ఇదే విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకు వెళ్లగా అలాంటిదేమి లేదని బదులిచ్చారు. నిత్యం కోనేరు పూడిక తీత సమయంలో పెద్దసంఖ్యలో భక్తులు ఉంటున్నారని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొత్రమధు తెలిపారు.

బీసీల న్యాయమైన వాటాకై పోరాటం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జనాభాలో సగభాగం కన్న ఎక్కువగా ఉన్న బీసీలకు న్యాయమైన వాటా కోసం పోరాడేందుకు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు బీపీ మండల్ చేసిన సిఫార్సులను మొత్తం అమలు చేయాలన్నారు. బీసీలకు విద్య రంగంలో 27 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం ప్రకటించిన రోజైనా ఆగస్టు 7న మండల్ డేగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో జాతీయ ఓబీసీ మహాసభలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సారి ఈనెల 7వ తేదీన తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. యుగేందర్, వంశీ, దోమవెంకట్, వెంకట్రాములు, బాల్‌రాజు, ఆనంద్‌గౌడ్, శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే రాజకీయ భవిష్యత్



రాజోళిలో పోస్టర్ విడుదల చేస్తున్న సంఘం నాయకులు

రాజోళి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీలంతా ఏకతాటిపైకి వస్తేనే రాజకీయ భవిష్యత్ ఉంటుందని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. పద్మశాలి సంక్షేమంతో పాటు రాజకీయ వాటా సాధనలో భాగంగా సెప్టెంబర్ 3న రాజకీయ శంఖారావ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం, మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంత, మచ్చ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు పులిపాటి వెంకటేష్, దామ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి..

అలంపూర్ రూరల్: పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. పట్టణంలోని చేనేత సహకారం సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం కల్పించే అన్ని పథకాలను లబ్ధిపొందాలన్నారు. అంతకుముందు జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వహించారు. అనంతరం పద్మశాలీయుల రాజకీయ చైతన్యయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మురళీ, మల్లేశం, వీరన్న, రూప, సత్యం, గడ్డం నాగన్న, పల్లె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలపై ప్రభుత్వాల చిన్నచూపు..

అమరచింత: పద్మశాలీలపై రాజకీయ పార్టీలతో పాటు ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని కందగడ్ల స్వామి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే పద్మశాలి రాజకీయ శంఖారావంను జయప్రదం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళవారం మండలానికి చేరుకున్న ఆయన భక్తమార్కండేయ ఆలయంలో సంఘం సభ్యులతో సమావేశమయ్యారు.